## క్లుప్తంగా

### అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



ఏటూరునాగారం : మండల కేంద్రంలో వైభవంగా నిర్మాణం అవుతున్న హరిహర పుత్రుడు అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా రామన్నగూడెం వాస్తవ్యులు అప్పని సమ్మయ్య–ముత్తమ్మ దంపతులు రూ.24వేలు విలువ చేసే వెండి, బంగారం వస్తువులను విరాళంగా కమిటీ వారికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో గౌరిశంకర్, ఎగ్గడి కోటయ్య, అల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేపై దాడి అమానుషం



గోవిందరావుపేట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసుల దాడి అమానుషమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యేపై పోలీసుల అప్రజాస్వామికమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పోలీసులతో దాడులు చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, లక్ష్మణ్, రాజు, వస్రాం, శ్రీనివాసరావు, దేవా, తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ములుగు: ఫినెక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 17న జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాల్గో విడత ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు ఫౌండర్ జంపన్ననాయక్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పత్తిపల్లిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు షుగర్, బీపీ, ఉచిత కంటి పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్ చేయబడుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి రానున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు 9676977278 నంబర్‌కు వివరాలు అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, ఇది వరకు తీసుకుంటున్న మందుల చీటీలు, ఫోన్‌నంబర్ తీసుకు రావాలని కోరారు.

### మండల కమిటీ ఎన్నిక

చిట్యాల: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ తెలిపారు. అధ్యక్షుడిగా మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పర్లపెల్లి కుమార్, ఉపాధ్యక్షులుగా పుల్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల రమేశ్, మండల కోశాధికారిగా రత్న రమేశ్, మండల కార్యదర్శిగా మట్టెవాడ కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. తనను మండల అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ మహారాజ్, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపాడు. మండల స్థాయిలో బలోపేతం చేయడానికి తన వంతుగా శక్తి వంచన లేకుండా పని చేస్తానని పేర్కొన్నారు.

### ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఏటూరునాగారం : మండలంలోని ఆకులవారి ఘణపురం గ్రామానికి చెందిన ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎండి.యాకూబ్(38) మండల కేంద్రంలో చికెన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య రఫియా, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు.

# కుటుంబ సమగ్ర సర్వే షురూ



మంగపేట : రమణక్కపేటలో సర్వే చేసిన ఫారాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు

మంగపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక , ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. సర్వే నిర్వహించేందుకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలను 124 బ్లాక్‌లుగా విభజించారు. శనివారం నుంచి ప్రారంభమైన సర్వే ఈనెల 18 వరకు 15,017 కుటుంబాలను సర్వే నిర్వహించేందుకు 101 ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లతో పాటు రిజర్వుగా 22 మందిని నియమించినట్లు మండల ప్రత్యేకధికారి తుల రవి తెలిపారు. వీరిలో మొదటి రోజు ఉపాధ్యాయులు 63 మంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు 9 మంది, పంచాయతీ సెక్రటరీలు 19 మంది, ఐకేపీ వీఓఏలు ఐదుగురు, సీఆర్‌పీ ఒకరు, ఆశ కార్యకర్తలు ఇద్దరు మొత్తం 101 మంది మొదటి రోజు 911 కుటుంబాల సర్వే చేసినట్లు ఆయన తెలిపారు.

**సర్వేను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్**

మండలంలో ప్రారంభమైన కుటుంబ సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు శనివారం పరిశీలించారు. మంగపేట, మల్లూరు, వాడగూడెం, రమణక్కపేట తదిర గ్రామాల్లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే చేసే సమయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా సరైన కోడ్‌తో సర్వే ఫారాలను పూరించాలని, సర్వే నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఎంపీడీఓ, భద్రు, ఎంపీఓ కిశోర్, సూపరింటెండెంట్ అలేటి సుదర్శన్, మంగపేట, మల్లూరు, చుంచుపల్లి, రాజుపేట, రామచంద్రునిపేట, బ్రాహ్మణపల్లి, తిమ్మంపేట తదితర గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు.

**సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి**

ఏటూరునాగారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని అదనపు కలెక్టర్ సంపత్ రావు తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. కుటుంబ యజమానులు వారి కులం, ఆస్తి తదితర వివరాలను సర్వేలో పూర్తిగా తెలపాలని కోరారు. ఎన్యుమరేటర్లు కూడా విసుక్కోకుండా యజమానితో మాట్లాడాలని సూచించారు. ఈ సర్వేలో 56 కాలమ్స్ ఉండగా అందులో కుటుంబ యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు చెప్పాల్సి ఉండడంతో ప్రజలు అనేక రకాలుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఎన్యుమరేటర్స్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇంటింటి సర్వేకు..**

వెంకటాపురం(కె): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. శనివారం మండలంలోని టీసీ మర్రిగడూడెం, చొక్కాల గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లోని అన్ని కుటుంబాలను సర్వే చేయాలని అన్నారు. అనంతరం ఎన్యుమరేటర్లకు తగిన సూచనలు, సలహాలను అందిచారు. ఆయన వెంట డీఎల్‌పీఓ మహమ్మద్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ హనుమంతరావు తదితరులు ఉన్నారు.

**చొక్కాలలో..**

మండలంలోని చొక్కాల గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు

**వాజేడులో..**

వాజేడు : కుటుంబ సమగ్ర సర్వేను ములుగు డీపీఓ ఒంటేరు దేవరాజ్ ఎంపీడీఓ విజయతో కలిసి పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఈ సర్వే కొనసాగుతుండగా మండల కేంద్రంలో సర్వే విధానాన్ని వారు పరిశీలించారు. ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, గుమ్మడిదొడ్డి, టేకుల గూడెంలలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. వాజేడు మండలంలోని 102 బ్లాకుల్లో 66 మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్ వైజర్లు ఈ సర్వేను చేస్తున్నారు.

కన్నాయిగూడెం: సమగ్ర కుటుంబ సర్వే మండలంలో ప్రారంభమైంది. శుక్రవారం ముందస్తుగా ఇంటి డోర్లకు స్టిక్కర్లను అధికారులు అంటించారు. శనివారం ఉదయం నుంచి ఇంటింటి సర్వేను ప్రారంభించి మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టారు. సర్వేలో వివిధ శాఖలకు చెందిన అధికారుల ద్వారా సిబ్బందిని తీసుకొని సర్వేను కొనసాగిస్తున్నారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో సర్వేను కొనసాగిస్తున్నారు. ప్రతి ఒక అధికారి ఒక రోజులో ఎన్ని చేయాలనే దాన్ని సామర్థ్యంతో టార్గెట్ ఇచ్చారు.



వెంకటాపురం(కె): ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ దేవరాజ్



ఏటూరునాగారం : సర్వేలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

**తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి**

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తప్పులు లేకుండా కులగణన సర్వేలో సమగ్రంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ సుమనవాణి సూచించారు. తాడ్వాయిలో శనివారం నుంచి ప్రారంభించిన కుటుంబ సమగ్ర సర్వేను ఆమె తనిఖీ చేశారు. తాడ్వాయిలోని ఇంటింటా ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. కుటుంబ సభ్యులు వివరాల నమోదు ఎలా చేస్తున్నారని సర్వే చేస్తున్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్ ఉన్నారు.



వాజేడు: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు



కన్నాయిగూడెం : బుట్టాయిగూడెంలో సమగ్ర సర్వే చేస్తున్న అధికారులు



ఎస్ఎస్ తాడ్వాయి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమనవాణి

## ఇంటినుంచి వెళ్లిన బాలికను పట్టుకున్న పోలీసులు

ఏటూరునాగారం: ఇంటి నుంచి పారిపోయిన బాలికను స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వట్టం సురేశ్, లక్ష్మీ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఏడేళ్ల బాలిక ఉంది. ఇంట్లో భార్యభర్తలు గొడవ పడుతుండగా బాలిక దేవి మధ్యలో వెళ్లి తల్లిదండ్రులను నివారించే ప్రయత్నం చేసింది. ఇద్దరు కోపోద్రుకులై బాలికపై చేయి చేసుకునేందుకు రావడంతో భయంతో ఇంటి నుంచి పారిపోయింది. ఈ విషయాన్ని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా పోలీసులు రంగంలోకి దిగారు. ఫిర్యాదు అందిన గంటలో గోదావరి కరట్టపై సంచరిస్తుండగా పట్టుకొని ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్ లలిత కుమారి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై తాజొద్దీన్

## అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



గోవిందరావుపేట : నాగారంలోని బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సృజన్‌కుమార్



వాజేడు: బీఎల్‌ఓతో మాట్లాడుతున్న తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్

గోవిందరావుపేట : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సృజన్ కుమార్ అన్నారు. మండలంలోని పస్రా నాగారంలోని పోలింగ్ బూత్‌లను స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఓటరు నమోదు, తొలగింపు, మార్పులపై నిర్వహిస్తామని అన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్**

వాజేడు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ పరిశీలించారు. నూతన ఓటర్ల నమోదు తప్పొప్పులను సరి చేసుకోవడం కోసం ప్రత్యేకంగా క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం ఆదివారం బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని అధికారులు ఆదేశించారు.ఆదివారం కూడా అందుబాటులో ఉండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.

## కోతుల బెడదను నివారించాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారంలో కోతుల బెడదను నివారించాలని గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువజన సంఘం నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీశ్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతుల బీభత్సంతో గ్రామంలోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలను నాశనం చేయడంతో పాటు ఇళ్లలో దూరి నానా హంగామా చేస్తున్నాయన్నారు. మేడారానికి వచ్చిన భక్తులపై దాడి చేస్తూ భయభ్రాంతుకు గురి చే స్తున్నాయన్నారు. మేడారంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోని విద్యార్థినులపై దాడి చేసి గాయపర్చిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ బాబురావు, అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భోజరావు, సమ్మారావు, యాదగిరి, నరేష్, వెంకన్న, అర్జున్ రమేశ్ పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘం నాయకులు

### వాహనాల తనిఖీ

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో ఎస్సై ఎండీ.శాఖాన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనానికి నంబర్ ప్లేట్ తప్పకుండా ఉండాలని తెలిపారు. వాహనాల్లో ఎలాంటి నిషేధిత మత్తు పదార్థాలను తీసుకపోకూడదని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లింగన్న, సందీప్ పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శాఖాన్

## మనోభావాలు దెబ్బతినకుండా ప్రతిష్ఠాపన

- హనుమాన్ గుడివద్దనే భారీ విగ్రహం ఏర్పాటు

ఏటూరునాగారం : అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ప్రతిష్ఠాపన చేసేందుకు గ్రామస్తులు, ప్రజలు, రామ, ఆంజనేయ, అయ్యప్పభక్తులు, భవాని మాలదారుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఆలయ కమిటీల సమావేశంలో వారు మాట్లాడుతూ వై జంక్షన్ వద్ద హనుమాన్ విగ్రహాన్ని నిర్మించాలని నాలుగేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నామన్నారు. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. వై జంక్షన్‌లో ఉన్న అమరవీరుల విగ్రహాలను గౌరవిస్తూ భక్తిభావంతో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. గ్రామపెద్ద అయిన కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని అనుకున్నామన్నారు. అయితే కొంత మంది ఆదివాసీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దానిని క్రాస్‌రోడ్డులోని హనుమాన్ గుడి వద్ద నిర్మించి ప్రతిష్ఠించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనవసరమైన ప్రకటనలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దని, రెచ్చగొట్టే ప్రకటనలు చేయరాదన్నారు. ఇప్పటి వరకు గిరిజనులు, గిరిజనేతరులు సోదరభావంతో ఉన్నామని, ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావాలని రెండు వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. క్రాస్‌రోడ్డులోని హనుమాన్ గుడి వద్ద నిర్మించ తలపెట్టిన హనుమాన్ విగ్రహానికి అన్ని వర్గాల ప్రజల సహకరించి ప్రతిష్ఠాపన విజయవంతమయ్యేలా చూడాలని కోరుతున్నాం.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని జంగాలపల్లి, బంజరుపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శానబోయిన రమేశ్, రాయిశెట్టి భిక్షపతి, కంచం రాధికలు మృతి చెందగా వారి కుటుంబాలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పరామర్శించారు. శనివారం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు చాంద్ పాషా, కుమార్‌గౌడ్, నల్లెల్ల భరత్, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, లక్కీ, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ధనసరి సూర్య అన్నారు. మండలంలోని బయ్యక్కపేటలో శనివారం జరిగిన చందా లక్ష్మీనారాయణ పెద్దకర్మకు ఆయన హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చుపటేల్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలా శ్రీకాంత్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పాముకాటు గురై తాడ్వాయి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మండలంలోని పంబపూర్‌కు చెందిన నాలి రవివర్మను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయకులతో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారి చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో నాయకులు మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చు పటేల్, మాజీ సర్పంచులు సునీల్ దొర, నరసింహస్వామి , తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు గంట సాయి రెడ్డి, మంకిడి ప్రశాంత్, తదితరులు ఉన్నారు.



ములుగు రూరల్ : బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ రవిచందర్




ఎస్ఎస్‌తాడ్వాయి: లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్య



చికిత్స పొందుతున్న రవివర్మను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## వాహన పత్రాలు కలిగి ఉండాలి

చిట్యాల: ప్రతీ వాహనానికి అనుమతి పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయం తెల్లవారుజామున కాలనీలోని ఇళ్లలో తిరిగి తనిఖీ చేపట్టారు. కాలనీలో ఉన్న 30 వాహనాలను తనిఖీ చేసి అందులో పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రతీ వాహనానికి అనుమతి కలిగి ఉండాలని అలాగే నంబర్ ప్లేట్ ఉండాలని అన్నారు. లేకుంటే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని అన్నారు. ప్రమాదాలకు గురైతే అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై ఎండీ.శాఖాన్, పోలీస్ సిబ్బంది లాల్ సింగ్, లింగన్న, అస్లాంజానీ, రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

### గుడుంబా స్వాధీనం

రేగొండ: మండలంలోని గూడెపల్లిలో శనివారం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేసి. వంద లీటర్ల బెల్లం పానకం పారబోసి, పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ధరంసోత్ సంపత్, నాగవత్ రాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### గాంధీనగర్‌లో చోరీ

రేగొండ(కొత్తపల్లిగోరి): తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి బంగారం, నగదును చోరీ చేసిన ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన నల్లెల సూరయ్య శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించారు. ఇంట్లో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.50 వేలు నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు సూరయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వ్యాధులు రాకుండా చూసుకోవాలి

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి, రామకిష్టాపూర్(టి)లోని గొర్రెలకు మండల పశువైద్యాధికారి వివేక్ ఆధ్వర్యంలో శనివారం పీపీఆర్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. జీవాలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పశువైద్యుల సలహా మేరకు వైద్యం చేయించాలన్నారు. ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. మేకల కుమార్ ఉన్నారు.



పశువులకు టీకాలు వేయిస్తున్న పశువైద్యాధికారి వివేక్

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఎల్లమ్మతల్లి ఆలయంలో రూ.5 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనుల శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం సీసీ రోడ్లతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగ ప్రభాకర్, మాజీ సర్పంచ్ వంగ కుమారస్వామి, మండల నాయకులు కత్తి సంపత్, చదువు మహేందర్, తుమ్మేటి సురేందర్‌రెడ్డి, బోనగిరి తిరుపతి, శ్రీధర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సతీశ్